# పిల్లి పిల్లలు

యువ-పుష్య బహుళ సప్తమి వెళ్ళి అష్టమి వచ్చింది. అంతా డాబాల మీద గాలిపటాలు ఎగరేసుకుంటున్న సమయంలో నేనీ కథ వ్రాస్తున్నాను.

నిజానికి ఇది కథ కాదు.

అట్లని కాకుండానూ పోదు

ఇదొక కఠోర సత్యం

నిజంగా జరిగిన సంఘటన.

1996, జనవరి 13వ తేదీ భోగి-శనివారం నాడు జరిగింది.

ఇందులో అతిశయోక్తులు, అలంకారాలు లేవు.

ఇది కథో, వ్యంగ్యమో-వచన రూపంలోని కరుణారస ప్రవాహమో-మీరే చదివి నిర్ణయించుకోండి.

ఇక ఉపోద్ఘాత మెందుకు?

అసలు విషయం చెపుతాను.

ఈ కథానికల సంపుటి 'అచుంబితం', ఈ కథానిక వ్రాస్తున్న సమయానికి చాలా భాగం ముద్రణ ముగిసింది.

ఇక కవర్ పేజీ గూర్చి. ఆవిష్కరణోత్సవం గూర్చి ఆలోచిస్తున్నాను.

'పోస్టు' వాకిట్లో కేక.

వెళ్ళి ఉత్తరాలు తెచ్చుకున్నాను.

రవీంద్ర భారతిలో ఒక ప్రముఖుడికి సన్మానం

అతడు నాకు ఆత్మీయుడు. కాబట్టి వెళ్ళాలి.

శ్రీకృష్ణదేవరాయ భాషా నిలయంలో కవి సమ్మేళనం పాల్గొనాలి.

భారతీయ విద్యాభవన్‌లో 'పర్యావరణం'పై పెద్ద సదస్సు

జాతీయ అంతర్జాతీయ ప్రముఖులు వస్తున్నారు, వెళ్ళాలి.

అన్నిటికి వెళ్ళలేను, వెళ్ళకపోతే బాగుండదు.

కాబట్టి కొన్నింటిలో ముఖం చూపించి అటెండెన్సు వేయించుకొని వస్తే చాలు ఇలా ఆలోచిస్తూ ఇంట్లోకి రాగానే

"పిల్లి పిల్లి" అనే కేక వినిపించింది.

'ఏమిటి' అన్నాను ఉలిక్కిపడి

'ఏమి టేమిటి? పిల్లి పాలగిన్నెలో మూతి పెట్టింది'-అన్నది ఉమాదేవి.

'ఏది పిల్లి?' అంటూ వంటింట్లోకి వెళ్ళి చూచాను.

లేదు

"ఇంకా అక్కడ ఉంటుందా? ఏమిటి? కిటికీలోనుండి దూకి పారిపోయింది" అన్నది ఆమె

నేనేమీ మాట్లాడలేదు-

తానే మళ్ళీ అందుకున్నది.

'నేను మొదటినుండి చెపుతూనే ఉన్నాను, పిల్లిని చనువుగా ఇంట్లో తిరగ నివ్వకూడదని-నామాట ఎవరు వింటారు? ఇప్పుడీ పాలు ఏం చేయాలి?' అన్నది కోపంగా.

"ఎటు తిరిగీ పిల్లి ముట్టింది కాబట్టి దానికే పోస్తేసరి. పైగా అది చూలాలు కూడాను" అన్నాను అనునయంగా.

ఈ మాటలు ఆమెకు ఇంకా కోపాన్ని తెప్పించాయి.

కొంచెంసేపు చిటపటలాడింది.

"అది పిల్లలు పెట్టడానికి కాబోలు ఆ గదిలో నుండి ఈ గదిలోకి, ఈ గదిలో నుండి ఆ గదిలోకి తిరుగుతున్నది. పిల్లల్ని పెడితే ఇంక ఇంటినిండా తల్లీ పిల్లలూ తిరుగుతూ నానా కంగాళీ చేస్తాయి-" అన్నది కోపంగా

"మరైతే ఏం చేయమంటావు?

"ఏముంది? ఎక్కడైనా వదిలేసిరండి"

"చూడు-చూలాలిని వదిలేసి రావడానికి నేనేమీ లక్ష్మణుణ్ణి కాదు. నోరు లేని జీవం కాబట్టి ఇలా అన్నావు. అదే ఒక రాజకీయ నాయకుడో, గ్యాంగ్ లీడరో ఫిలిం హీరోయినో అయితే ఇలా నిర్లక్ష్యంగా మాట్లాడ గలవా?"

"అంత మక్కువ ఎక్కువైతే దానిని ఎవరింటికైనా తీసుకుపోయి పురుడు పోయించండి దగ్గర ఉండి, ఇక్కడ మాత్రం అది ఒక్క క్షణం కూడా ఉండడానికి వీలులేదు-ఎంత సేపూ మీ గొడవమీదే కాని నేనెందుకు చెపుతున్నానో పట్టించుకోరేం" అంటూ అవతలికి వెళ్ళిపోయింది.

ఆమె ఇలా అన్నా నాకు మాత్రం పిల్లిమీద మమకారం అవగింజంతయినా తగ్గలేదు.

నేను ఇటీవల శ్రావణి, ఆవాహన అచ్చువేశాను. ఇవి కాక నా దగ్గర చాలా పుస్తకాలు ఉన్నాయి.

బీరువాలో పెట్టినవి పెట్టగా ఇంకా చాలా బయట మిగిలి పోయాయి.

ఇంకేం ఎలుకలు క్రమంగా ప్రవేశించాయి. ఈ పిల్లి వచ్చిన దగ్గరి నుండి ఎలుకలు తగ్గిపోయాయి. ఇలా నా పుస్తకాలకు ఈ పిల్లివల్ల రక్షణ ఏర్పడింది. అట్లాంటి పిల్లిని చూలాలిగా ఉన్నప్పుడు ఏ గోనె సంచిలోకో ఎక్కించి దూరంగా ఏ సీతాఫల్ మండిలోనో వదిలేసి రావడం చాలా అన్యాయం అనిపించింది.

ఐతే ఈ సమస్యకు పరిష్కారం ఏమిటి?

బయట అసలే పుష్యమాసపు చలి.

ఎముకలు కొరుక్కుతింటున్నది.

ఈ పిల్లి గూర్చి ఎవరు పట్టించుకుంటారు??

దూడ మూతి కట్టి పాలు పిండుకోవడానికి ఆవును పెంచుతారు. తినడానికి పనికి వస్తుందని కోళ్ళను మానవుడు పెంచుతాడు. ఎక్కి తిరగవచ్చని గుర్రాలను, బండి ఎద్దులనూ పెంచుతారు కాపలాకై కుక్కలను వాడుకుంటాడు.

దీని గూర్చి పట్టించుకునేదెవరు?

పూర్వం ఉడుములనూ, మొసళ్ళనూ, ఏనుగులనూ యుద్ధాలలో వాడేవాళ్లు. కవి సింహం. కవి పుంగవ, కవిదిగ్గజ, మదగజయాన వంటి పేర్లతో కళాకారులు గౌరవింపబడేవారు. మకరకుండలాలు ధరించేవారు. ఐతే ఎవరూ పిల్లి పురుడు గూర్చి ఆలోచించినట్లు కన్పడదు.

మా ఇంటికి రెండిళ్ళ అవతల మా ఆవిడ తమ్ముడు భాగవతుల ఉదయ శంకర్ ఫోటోగ్రఫి స్టూడియో పెట్టుకున్నాడు.

సరే, ఏదైనా సహాయం చేస్తాడేమోనని - అతని దగ్గరికి వెళ్ళాను. సమస్యను సాకల్యంగా వివరించాను.

శంకర్ నవ్వి "బావగారూ, ఇదేమీ బోస్నియా అంతర్జాతీయ సమస్య కాదు. అయోధ్య, కాశ్మీరు కాదు. ఆఖరికి మామా అల్లుళ్ళ రాజకీయ పోరాటం కూడా కాదు దీనినిగూర్చి అసలు ఆలోచించవలసిన అవసరమేలేదు - డోంట్ వేస్ట్ యువర్ టైం" అన్నాడు (బహుశా 'మై టైం' అని మనస్సులో అనుకొని ఉంటాడు).

"అదికాదు శంకరూ, మనం పట్టించుకోకపోతే ఈ మూగజీవినీ కష్ట కాలంలో ఆదుకునేది ఎవరు? మీ అక్క చెప్పిన మాటలు నిజం, అది చాలా

రోజులుగా వంటింట్లో దూరుతున్నది పక్కలు పాడుచేస్తున్నది. మీ ఇంట్లో డార్క్ రూం అవతల చెత్తా చెదారం వేశారుకదా . అక్కడ వదిలి పెడదాం - ఏమంటావు?" అన్నాను.

"అది చెత్తా చెదారం కాదు బావగారూ - స్టూడియో ఎక్విప్‌మెంటు, నెగిటివ్‌ల డబ్బాలూ, లోషన్లూ కూడా అక్కడ దాచుకున్నాను అందుకని వీలు పడదు. పిల్లిమీద ఫోటో తీసి కాలెండర్లు తయారుచేయగలను కాని, పిల్లినీ పిల్లలనూ నా ఇంట్లో పూటికి ఉంచుకోవడం సాధ్యపడదు" అని ఖండితంగా చెప్పాడు శంకర్.

"మరెలా శంకర్? పోనీ బ్లూ క్రాస్‌కు ఫోన్ చేద్దామా?"

"మీ ఇష్టం - మీరేంచేయాలో అది చేసుకోండి, వాళ్లు వీధి కుక్కల విషయంలో ఎక్కువగా శ్రద్ధ వహిస్తున్నారు పిల్లిగూర్చి నాకంతగా తెలియదు."

"పోనీ, అప్పలాచారిగారి పెరడు ఖాళీగా ఉందికదూ-ఒప్పుకుంటాడేమో".

"లాభంలేదండీ అయనకు బల్లి అంటేనే ఎలర్జీ - ఇక పిల్లిని దాని పిల్లలను భరిస్తాడా? 'పిల్లీ - మల్లీ - తల్లీ - చెల్లీ - మళ్ళీ మళ్ళీ - రానే వల్లీ' అంటూ సినిమా గేయాలు వ్రాసి డబ్బు సంపాదించుకుంటాడు కాని, నిజమైన పిల్లిని గూర్చి ఆయన పట్టించుకోడు. వెళ్ళి - లేదనిపించుకోవడం ఎందుకు?"

'సంఘ సేవిక పుల్లమ్మగారికి ఫోన్‌చేస్తే?"

"ఆవిడ స్త్రీల సమస్యలను గూర్చి ఆలోచిస్తుందేకాని పిల్లుల సమస్యను గూర్చి కాదు. కన్యాశుల్కం, వరశుల్కం, బ్రైడ్ బర్నింగ్ ఇలాంటి వేవైనా ఆవిడ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తుంది".

"కన్యాశుల్కం ఇప్పుడు ఒక సాంఘిక సమస్య కాదు కదా"

"కాకపోవచ్చు. కానీ ఆ పేరుతో ఓ నాటకం ఉంది, అందులోనూ బ్రాహ్మణ వ్యవస్థపై దుమ్మెత్తిపోశారు కాబట్టి కన్యాశుల్కాన్ని గౌరవించవలసిందే."

శంకర్ అరటిపండు వలిచి చేతిలో పెట్టినట్లు ఇంత స్పష్టంగా సమస్యను విడమరచి చెపుతుంటే ఇక నేనేమీ మాట్లాడలేకపోయాను.

అక్కడినుండి లేచి వెళ్ళి జైన్ గారింటికి చేరాను.

"ఆయియే - పధారియే - శివప్రసాద్ జీ,"

ఆప్యాయంగా జైన్‌గారు నన్ను పిలిచి సంక్రాంతి శుభకామనలు అందజేశారు,

జైన్‌గారు చాలా మంచిమనిషి, ఆయన పూర్వీకులు చాలాకాలం క్రితమే అహమ్మదాబాదు ప్రాంతంనుండి హైదరాబాదు వచ్చి స్థిరపడిపోయారు. వ్యవసాయం చేస్తే నాగలికి తగిలి జీవహింస జరుగుతుందని వాళ్ళు వడ్డీవ్యాపారం మాత్రం చేస్తుకుంటారు. వీర శివాజీ స్మారక సంఘం కార్యవర్గ సభ్యుడు.

అమాట ఈమాటా మాట్లాడి జైన్‌జీతో నా సమస్యను ప్రస్తావించాను.

ఆయన నవ్వి తన అశక్తతను వ్యక్తంచేశాడు. లోగడ ఒకసారి ఆయనను ఎలుక కరిచిందట, నారాయణగూడా బ్లడ్ బ్యాంకుకు వెళ్ళి ఇంజక్షన్లు తీసుకున్నాడట. అప్పటినుండి ఎలుక - పిల్లి - కుక్క - వంటి వాటిని చూస్తే ఆయనకు చచ్చేంత భయం.

"మీ ఇంట్లో పిల్లి అరిస్తేనే ఇక్కడ నాకు బి.పి. పెరుగుతుంది భాయి సాబ్" అన్నాడు జైన్‌జీ.

సరే, మర్యాదకోసం మరి కొంచెంసేపు ఏదో పిచ్చాపాటీ మాట్లాడి మెల్లగా జారుకున్నాను.

ఇక నాకు మిగిలిన ఏకైక ఆశాదీపం వెంకట్రామావధానిగారు.

"అయ్యా, వెంకట్రావుగారూ - సుప్రభాతం" అంటూ వెళ్ళను.

ఆయన ఆప్యాయంగా ఆదరించాడు. మెల్లగా నా సమస్య ఆయనముందు ఉంచాను. వెంకట్రావుగారు నన్ను ఒక ఎలుకను చూచినట్లు ఒక్కక్షణం చూచాడు.

"ఇదిగో చూడండి నేను ఎంత నిష్ఠాపరుణ్ణో మీకు తెలియనిదికాదు. అలాంటప్పుడు మా ఇంట్లో పిల్లుల పురుళ్ళు ఎలుకల సమర్తలూ - అంటూ అపవిత్రం చేయమనడం న్యాయమా?

"అదేమిటి వెంకట్రావుగారూ మీరు భూత దయ గీతలో చెప్పబడి ఉన్నదని చాలాసార్లు ప్రసంగించారు కదా."

"ఔనయ్యా, మీలాంటివాళ్ళతో వచ్చిన చిక్కే ఇది - అక్కడ 'భూత శబ్దం పంచభూతాల విషయంలో ప్రయోగింపబడినది జగత్తు మిధ్య, బ్రహ్మమే సత్యం, లేని పిల్లి ఉన్నట్లు నీకు కన్పడుతున్నది. పిల్లి పుట్టకముందు ప్రాగభావం. పోయిన తర్వాత ప్రధ్వంసాభావం. తెలిసిందా?"

"తెలిసింది - తెలిసింది" అన్నాను పైకి.

ఈ వెంకట్రావు ఒకనాడు కొబ్బరి పచ్చడిలో ఉప్పు తక్కువ అయిందని ఇల్లాలిని కొట్టాడు. ఉప్పు మిథ్య కాదా? దానికి ప్రధ్వంసాభావమూ - ప్రాగ భావమూ వర్తించవా?? - అనుకున్నాను సెకండ్ ఛానల్‌లో.

"చూడండి శివప్రసాద్‌గారూ, గోపూజ, హరిణపాలను, సాత్వికులైన నాలాంటివారికి చెప్పారు. గుర్రములూ, ఏనుగులూ క్షత్రియులు పోషించవచ్చు.

పందులను మరికొందరు పెంచుతారు అంతేకాని పిల్లిసమర్త, పిల్లిపురుడు గూర్చి ఏ శాస్త్రంలోనూ చెప్పబడి ఉండలేదు. ఐనా మీరు గృహ్యసూత్రములూ స్మృతులూ, ఉపనిషత్తులూ చదివినవారేకదా" అంటూ నాకే ఎదురుప్రశ్న వేశాడు.

హతాశుడినై మారు మాట్లాడకుండా ఇంటికి చేరాను.

అప్పుడు నాకు నారాయణ గుర్తుకు వచ్చాడు. అతడు సామ్యవాది. శ్రామికులకోసం ఉద్యమాలు నడుపుతుంటాడు. నేనంటే గౌరవం కూడా ఉంది.

"హల్లో? నారాయణా? ఒక పెద్ద సమస్య వచ్చిపడింది." అన్నాను రింగ్ చేసి.

"ఎమిటి సార్, చెప్పండి, ఎవడైనా భూస్వామి కార్మికులను, కర్షకులను వేధిస్తున్నాడా?"

"కాదు-కాదు-ఇది వేరే సమస్య, ఓపిల్లి సమస్య అది ఈనడానికి చోటులేక అవిశ్రాంతంగా తిరుగుతున్నది."

"మరీ జోక్ వేయకండి మాష్టారూ-ఏదైనా వర్గ సంఘర్షణ గూర్చి చెప్పండి, వింటానుకాని ఈ పిల్లి-పిల్లి-అంటూ తమాషాగా మాట్లాడకండి" అన్నాడు ఫోన్‌లో నవ్వుతూ.

నారాయణ నెలజీతం ఇంటికి చేరటం లేదని ఆయన భార్య నాతో చాలా సార్లు చెప్పింది. తాగుడుకూ, తిరుగుళ్ళకూ ఖర్చు పెడుతున్నాడని ఆవిడ ఆరోపణ అలాంటిదేమీ లేదనీ, ఉద్యమాలకోసమే తన డబ్బు ఖర్చు చేస్తున్నాడని లోగడ నారాయణ నాకొకసారి సంజాయిషీ చెప్పుకున్నాడు.

"నారాయణా? ఐతే ఈ పిల్లి సంగతి ఏం చేద్దాం?'

"మాష్టారూ దాని సమస్యను ఎలా పరిష్కరించుకోవాలో దానికి తెలుసు. పైగా పిల్లి బూర్జువా వర్గానికి చెందింది. సుఖభోగాలంటే చాలా ఇష్టం. మెత్తగా పరుపులల్లో దుప్పట్లల్లో దూరి పడుకొంటూ ఉంటూంది." అన్నాడు నారాయణ.

ఇంకేం చేయను?

ఫోన్ పెట్టేసాను.

ఇంతలోనే గద్దలగుంట మహారాణి గుర్తుకు వచ్చింది. ఆవిడ ఆ మధ్య ఒ పిల్లి కావాలని అడిగింది కూడాను.

"హల్లో? రాణిగారా-నేను శివప్రసాద్ ను మాట్లాడుతున్నాను. మీరు పిల్లి కావాలన్నారు కదమ్మా? మాపిల్లి ఈనుతున్నది పంపమంటారా?"

"వద్దుసార్-మొన్ననె ఓ పామరేనియన్ కుక్కపిల్లను తెచ్చుకున్నాను. ఇక పిల్లిని పెంచే ఓపిక లేదు-కావాలంటే పిల్లిమీద ఒ నవల వ్రాసి ఏ నిర్మాతకైనా సినిమా కథగా అమ్ముతాను ఇటీవల తెరపై జంతువులకూ సరీసృపాలకూ గిరాకీ బాగా ఉంది సార్."

"సరే-నమ్మా"

"సార్-ఏదైనా గేదె ఈనితే చెప్పండి సార్-జున్నుపాలు తీసుకుంటాను."

"మంచిదమ్మా." అని ఫోన్ పెట్టేశాను,

నేనిక నిస్సహాయుణ్ని?

ఏ ఆర్యసమాజిష్టూ నాకు సాయం చేయడంలేదు-ఏ ఫెమినిస్టూ నా ఆడపిల్లి గూర్చి పట్టించుకోదు.

మార్జాల కిశోరన్యాయం గూర్చి ఈశ్వరతత్వం బోధించే ఏ భక్తునికీ నా పిల్లి ఒక సమస్యగా కన్పడటంలేదు.

మనుషులను చంపడానికి తుపాకులను పట్టుకోండి అని ప్రేరేపించేవాళ్లు ఈ పురిటి నొప్పుల గూర్చి ఆలోచించరు.

మనిషికి సృష్టికంటే విధ్వంసం అంటే ఎందుకంత ఇష్టం?? "తుపాకీల హతంచేసి కృపాకీల వెలిగించు" అనే గేయం సెకండ్ చావన్‌లో పాడుకుంటూ, (అశక్తులు అంతకంటే ఏం చేస్తారు?)

మాట్లాడకుండా ఇంటికి చేరాను. ఇసకలో తలదూర్చిన ఉష్ట్రపక్షి తన ఎస్కేపిజంతో సమస్యనుండి పారిపోయినట్లు భ్రమిస్తుంది.

నాపరిస్థితి అలాంటిదే.

"పిల్లీ? ఇక నీ సమస్య నీవే పరిష్కరించుకో!"అని మనస్సులోనే అనుకోని ఊరుకున్నాను. ఏ మైండో పిల్లి కన్పడటం మానేసింది." అమ్మయ్య" అని నిట్టూర్చాను. "పాపం" అని జాలిపడ్డాను, పిల్లిని ఎవరైనా పట్టుకొని పోయారా?

చంపేశారా?

వేరే కాలనీకి పారిపోయిందా?

ఏ మైందో? ఏమో?

తెల్లవార్లూ నిద్రకాని నిద్ర.

చెదిరిన స్వప్నాలు.

జనవరి -14వ తేదీన న్యూస్ పేపర్ పట్టుకొని, ఉదయమే మెడమీది కెళ్ళాను.

చలికొంచెం విరిగింది.

సూర్యుడు ఉత్తరాయణం మొదలుపెట్టాడు.

గదిలోనికి వెళ్ళి చూసేసరికి పిల్లి అరుపు విన్పించింది- క్రింద గుట్టగా పోసిన పుస్తకాలనూ, అవతల బుక్‌రాక్‌ను మరుగుగా చేసుకొని పిల్లి ప్రసవించింది.

అక్కడ భగవద్గీత, బైబిలు, ఖరాను, దస్ కాపిటల్, సత్యార్థప్రకాశిక దమ్మపదం, వంటి ఎన్నో విలువైన నా పుస్తకాలున్నాయి!!

నిన్నటివరకూ తాను రక్షించిన ఈ పుస్తకాలే రాత్రి ఈ అల్పజీవి పురిటి నొప్పులకు మరుగు కల్పించాయన్న మాట!!

మూడు తెల్లని పిల్లి పిల్లలు-

అమాయికమైన కన్నులు

ఎంత అందం,

ఎంత అపూర్వసృష్టి,

మూలప్రకృతికి కార్యరూపం!!

ఇటు పిల్లలూ-పెద్దలూ-రాజకీయ నాయకులూ, ఒకరేమిటి,-అన్ని వర్గాల వారూ ఆకాశంలో గాలిపటాలు ఎగురవేసుకుంటూ, ఒకరి గాలిపటాన్ని మరొకరి మాంజా కోసి వేసినప్పుడు, ఆనందంతో పెద్దగా అరుస్తున్నారు!!